క్లుప్తంగా

నేడు ఒంగోలు కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం

● పాల్గొననున్న ఎక్స్ అఫిషియో సభ్యుడు, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు టౌన్: ఒంగోలు కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశాన్ని శనివారం ఉదయం 10.30 గంటలకు కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి మేయర్ వేమూరి సూర్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవిలో ప్రధాన సమస్యలైన నీటి సరాఫరా, తీవ్ర వడగాడ్పులు, పారిశుధ్యం, తదితర అంశాలపై చర్చించనున్నట్లు చెప్పారు. నగరంలోని అన్ని డివిజన్ల కార్పొరేటర్లు సమావేశానికి హాజరుకావాలని కోరారు. డివిజన్ పరిధిలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని, సమస్యల పరిష్కారానికి తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. సమీక్ష సమావేశంలో ఎక్స్ అఫిషియో సభ్యులైన ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పాల్గొంటారని తెలిపారు.

1,026 పొగాకు బేళ్ల కొనుగోలు

ఒంగోలు రూరల్: స్థానిక పొగాకు వేలం కేంద్రం–2లో శుక్రవారం 1,026 పొగాకు బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణ అధికారి కె.రామకృష్ణ తెలిపారు. శుక్రవారం మొత్తం 1,050 బేళ్లు వేలానికి రాగా, ఒకటి నోబిడ్ అయింది. కేజీ గరిష్ట ధర రూ.201 కాగా, కనిష్ట ధర రూ.170, సరాసరి ధర రూ.199.78గా నమోదైంది.

పలువురు వలంటీర్లకు పురస్కారాలు

కొత్తపట్నం: మండలంలోని పలువురు వలంటీర్లకు ఉత్తమ సేవా పురస్కారాలు దక్కాయి. మండలంలో 241 మంది వలంటీర్లకుగానూ ఇద్దరికి సేవా వజ్రాలు లభించాయి. ఈతముక్కల గ్రామానికి చెందిన షేక్ బాజీబీ, చేవూరి శ్రీదేవి రూ.30 వేల చొప్పున నగదు బహుమతితో పురస్కారాలు అందుకున్నారు. మరో ఐదుగురు సేవారత్నాలకు ఎంపికై రూ.20 వేల చొప్పున అందుకోగా, 234 మంది సేవామిత్రల పురస్కారాలకు ఎంపికై రూ.10 వేల చొప్పున అందుకున్నారు. ఒంగోలులోని ఏ–1 ఫంక్షన్ హాలులో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో వలంటీర్లకు చెక్కులు పంపిణీ చేశారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఒంగోలు రూరల్: ఒంగోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం ఉదయం 10.30 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఒంగోలు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఒంగోలు ఎంపీపీ పల్లపోలు మల్లికార్జునరెడ్డి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, కో ఆప్షన్ మెంబర్లు హాజరుకావాలని కోరారు. 22 శాఖల మండలస్థాయి అధికారులు సమగ్ర సమాచారంతో హాజరుకావాలని కోరారు.

ఉపాధి పనుల పరిశీలన

చీమకుర్తి: మండలంలోని తొర్రగుడిపాడు, ఇలపావులూరు, గాడిపర్తివారిపాలెం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. రోజువారీ కూలి రూ.272 పడే విధంగా ఉపాధి సిబ్బంది చూడాలన్నారు. వేసవి కాలంలో టెంట్లు ఏర్పాటు చేయడంతో పాటు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు పుతి రమణమ్మ, రత్తయ్య, చల్లకొలుసుల అయ్యవీరయ్య, యద్దనపూడి అంజమ్మ, నూడిదేల విజయ భాస్కర్‌రెడ్డి, స్థానికులు పల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి నిత్యావసరాల పంపిణీ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న దృశ్యం

కొత్తపట్నం: పుట్టుకతోనే మానసిక వికలాంగుడై అనారోగ్యంతో జీవిస్తున్న నిరుపేద వ్యక్తి కుటుంబానికి మదర్ థెరిస్సా హెల్పింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కొప్పోలు గ్రామం అంబేడ్కర్‌నగర్‌కు చెందిన యేసయ్య కూలి పనులు చేసుకుంటూ జీవిస్తుంటాడు. అతని కుమారుడు పుట్టుకతోనే మానసిక వికలాంగుడు కావడంతో పాటు నిరుపేద కుటుంబం అయినందున పోషణ కష్టం మారింది. ఈ విషయం తెలుసుకున్న దాసరి సుబ్బారావు తన తల్లి దాసరి కోటేశ్వరమ్మ జ్ఞాపకార్థం నిత్యావసర సరుకులు అందజేశారు.

వెంకట్రామిరెడ్డికి నివాళులు



నివాళులర్పిస్తున్న నాయకులు

నాగులుప్పలపాడు: కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు డాకా వెంకట్రామిరెడ్డి 29వ వర్ధంతి సందర్భంగా పోతవరం గ్రామంలోని ఆయన విగ్రహానికి వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు డాకా అంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చల్లని చెట్లు..!



ఒంగోలు–కర్నూలు రోడ్డులో సంతనూతలపాడు–చీమకుర్తి మధ్యలో చెట్ల పొదరిల్లు



చీమకుర్తి బైపాస్‌లో రోడ్డుకు ఇరువైపులా ఆకట్టుకుంటున్న చెట్లు

వేసవి ఎండలు పీక్స్‌లో ఉన్నాయి. 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వడగాడ్పులు వీస్తున్నాయి. ఉక్కపోతతో ఒళ్లంతా మంటలు పుట్టించేలా చెమటలు పడుతున్నాయి. ఈ టైంలో ప్రయాణాలంటే తట్టుకోవడం కష్టమే. ఎంత వద్దనుకున్నా కొన్నిసార్లు ప్రయాణం చేయక తప్పదు. అలా ప్రయాణాలు చేసేవారికి ఉపశమనం కలిగిస్తున్నాయి ఈ చెట్లు. ఎప్పుడో ఏళ్ల క్రితం నాటి పెంచిన మొక్కలు ఇప్పుడు పెద్ద వృక్షాలై నీడనిస్తున్నాయి. మండుటెండల్లోనూ కూల్..కూల్ అంటున్నాయి. ఒంగోలు–కర్నూలు రోడ్డుతో పాటు పలు ప్రాంతాల్లో రహదారుల వెంట ఉన్న చెట్లు చల్లదనాన్ని చిందిస్తూ వాహనదారుల అలసట తీరుస్తున్నాయి. తమ విలువను ప్రజలకు చాటిచెబుతున్నాయి.

- సాక్షి, ఒంగోలు





చెట్ల నీడలో అలసట తీర్చుకుంటున్న పాదచారులు



అల్లూరు వద్ద రోడ్డు పక్కన చెట్టు నీడలో లారీ నిలిపి నిద్రిస్తున్న డ్రైవర్



కొప్పోలు గ్రామంలో...



చీమకుర్తి వద్ద రోడ్డు పక్కన చెట్ల నీడలో సేదతీరుతున్న వాహనచోదకులు



చెట్టు కింద ట్రాక్టర్



అల్లూరు వద్ద ఆహ్లాదంగా...

గ్రామగ్రామాన జగనన్న కుటుంబ సమావేశాలు



సజ్జల రామకృష్ణారెడ్డితో కలిసి వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

● సజ్జల రామకృష్ణారెడ్డితో కలిసి పోస్టర్లు ఆవిష్కరించిన ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

చీమకుర్తి: వైఎస్సార్ సీపీ బలోపేతానికి గ్రామగ్రామాన జగనన్న కుటుంబ సమావేశాల పేరుతో సంతనూతలపాడు నియోజకవర్గంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం తాడేపల్లిలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి ఆ మేరకు అనుమతి తీసుకున్నట్లు తెలిపారు. ఆ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను సజ్జలతో కలిసి ఎమ్మెల్యే టీజేఆర్ ఆవిష్కరించారు. ఈ నెల 21వ తేదీ నుంచి మన ఊరు–మన ఎమ్మెల్యే పేరుతో గ్రామగ్రామాన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రచారం చేయనున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. అందులో భాగంగా 20వ తేదీ నియోజకవర్గంలోని నాలుగు మండల కేంద్రాల్లో కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లు ఆవిష్కరించాలని వైఎస్సార్ సీపీ మండలాల కన్వీనర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ నాయకులకు సూచించారు.

పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ఆదర్శం



సుందరయ్యకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఒంగోలు టౌన్: భారత పార్లమెంట్‌లో తొలి ప్రతిపక్ష నాయకుడిగా అత్యంత సమర్థనీయంగా ప్రజల గొంతు వినిపించిన కమ్యూనిస్టు పార్టీ యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య జీవితాన్ని నేటి తరాలు ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం సీనియర్ నాయకుడు పై.సిద్దయ్య కోరారు. దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ అధ్యక్షత వహించారు. సిద్దయ్య ప్రసంగిస్తూ కమ్యూనిస్టు ఉద్యమానికి సుదీర్ఘ కాలంపాటు నాయకత్వం వహించి ప్రజాప్రతినిధులు ఎలా వ్యవహరించాలో ఆచరించి చూపిన గొప్ప నాయకుడు సుందరయ్య జీవితాన్ని ప్రతిఒక్కరూ అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇళ్లు, ఇళ్ల స్థలాల పంపిణీని ప్రభుత్వాల అజెండాగా మార్చిన ఘనత కమ్యూనిస్టు పార్టీలదేనన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పూనాటి ఆంజనేయులు, నాయకులు కె.రమాదేవి, కంకణాల ఆంజనేయులు, ఎస్కే మహబూబ్, జి.రమేష్, అమీర్, వినోద్, సువర్ణరాజు, ప్రవీణ్, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మంగమూరురోడ్డులో...

ఒంగోలు నగరంలోని మంగమూరురోడ్డులో గల సుందర్‌నగర్‌లో దామా శ్రీనివాసరావు అధ్యక్షతన పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. సీనియర్ నాయకుడు డాక్టర్ నల్లూరి రంగారావు జెండా ఎగురవేయగా షేక్ హుసేన్ సుందరయ్య చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. పలువురు వక్తలు సుందరయ్య పోరాటాలను గుర్తుచేసుకున్నారు. ప్రజల కోసం సంతానాన్ని కూడా వద్దనుకుని జీవితాన్ని ఉద్యమాలకు అంకితం చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్కే సిద్దయ్య, కసుమూరి, గొల్లపూడి హనుమంతరావు, గోవిందమ్మ, ఏవీ సుబ్బయ్య, ఉదయ్‌కిరణ్, ఎన్వీ రామయ్య, వెంకటేశ్వర్లు, నారిన రంగారావు, బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కూనంనేనివారిపాలెంలో...

చీమకుర్తి: పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి సీపీఎం నాయకులు పమిడి వెంకట్రావు, పూసపాటి వెంకట్రావు ఆధ్వర్యంలో శుక్రవారం కూనంనేనివారిపాలెంలో నివాళులర్పించారు. సుందరయ్య వర్ధంతి సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు.

క్రీడలతో ఉన్నత శిఖరాలు



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి

● క్రికెట్ పోటీలను ప్రారంభించిన ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి

కొత్తపట్నం: క్రీడలతో ఎంతో మంది ఉన్నత శిఖరాలు అధిరోహించారని, వేసవి సెలవుల్లో విద్యార్థులంతా క్రీడలపై దృష్టి పెట్టాలని కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి సూచించారు. చెరుకూరి ఉషారాణి ద్వితీయ వర్ధంతి సందర్భంగా వైఎస్సార్ సీపీ మండల నాయకులు, కొత్తపట్నం క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం రూ.4 లక్షల వ్యయంతో కొత్తపట్నంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎంపీపీ ప్రారంభించారు. ఆటగాళ్లను పరిచయం చేసుకుని మ్యాచ్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ డాక్టర్ చెరుకూరి వీరరాఘవరావు భార్య ఉషారాణి ద్వితీయ వర్ధంతి సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆటలతో శారీరక, మానసిక ఒత్తిళ్లు ఉండవన్నారు. ఆటగాళ్లు ఎటువంటి వివాదాలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో ఆడుకోవాలని సూచించారు. మొత్తం 40 జట్లు పాల్గొనగా శుక్రవారం 4 జట్లు పోటీపడ్డాయి. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బలగాని శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు బంకా శ్రీధర్, నాయకులు కట్టా శేఖర్, కోడూరి శ్రీను, తంబి సురేష్, పెద్ది కృష్ణారెడ్డి, పురిణి మహేష్, బట్టు ప్రభాకర్, వెంకటస్వామి, బాలకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి రూ.10 వేల బహుమతి



కృష్ణప్రియను అభినందిస్తున్న డాక్టర్ చాపల వంశీకృష్ణ, శాంతకుమారి

ఒంగోలు అర్బన్: 2022–23 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫలితాల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 595 మార్కులు సాధించిన ఉలవపాడు మండలం చాకిచర్ల గ్రామానికి చెందిన పి.కృష్ణప్రియకు స్థానిక శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు చెందిన మోకాళ్ల మార్పిడి శస్త్ర చికిత్స నిపుణుడు చాపల వంశీకృష్ణ, స్త్రీల వైద్య నిపుణురాలు చాపల శాంత కుమారి శుక్రవారం రూ.10 వేలు బహుమతి అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువును కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. భవిష్యత్తు లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రణాళికతో చదువుకుంటే ఉన్నత స్థానాలకు ఎదగవచ్చన్నారు. స్థానిక గుంటూరు రోడ్డులోని శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రామాయపట్నం సీఐ కిషోర్‌కుమార్, విద్యార్థిని తల్లిదండ్రులు రాజేష్, మైథిలి, ఇతర డాక్టర్లు సానల ధీరజ్‌బాబు, నాగిడి కుమార్ వర్మ, సున్నపు విజయ్‌కుమార్, దంతలూరి సరయు, పొక్కినగారి ఏడుకొండలు, రవి, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేత.. ఎఫ్‌సీసీ జట్టు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కనకారావు



ఫైనల్ మ్యాచ్‌లో తలపడుతున్న జట్లు

● బహుమతులు అందజేసిన మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కనకారావు

నాగులుప్పలపాడు: జేవైఎస్ రాజేష్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయిలో మండలంలోని ఉప్పుగుండూరులో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో ఎఫ్‌సీసీ జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. యువ ఫ్రెండ్స్, ఒంగోలు జట్టు ద్వితీయ స్థానం సాధించింది. విజేతలుగా నిలిచిన జట్లకు మొదటి బహుమతిగా రూ.25,116ను మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు అందజేశారు. ద్వితీయ బహుమతిగా రూ.20,116ను వైఎస్సార్ సీపీ నాయకుడు మద్దిసాని నాగేశ్వరరావు అందజేశారు. ఫైనల్ మ్యాచ్‌లో తలపడిన ఇరు జట్లలో ఒంగోలు యువ ఫ్రెండ్స్ జట్టు తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుని నిర్ణీత 12 ఓవర్లలో 75 పరుగులు చేసి ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎఫ్‌సీసీ జట్టు 9 ఓవర్లలో 76 పరుగులు చేసి విజేతగా నిలిచింది. ఎఫ్‌సీసీ జట్టులో అత్యధికంగా 40 పరుగులు చేసి జట్టు విజయానికి కారణమైన శ్రీనుకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేశారు. సిరీస్ మొత్తంలో 155 అత్యధిక పరుగులతో పాటు 5 వికెట్లు తీసిన యువ ఫ్రెండ్స్, ఒంగోలు జట్టు క్రీడాకారుడు పవన్‌కు మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అందజేశారు. మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన అమ్మనబ్రోలు, వేటపాలెం జట్లకు వరుసగా రూ.15,116, రూ.10,116 అందజేశారు.

రోడ్లు, బ్రిడ్జిలకు అనుమతి కోరిన ఎంపీ మాగుంట

ఒంగోలు: పీఎంజీఎస్‌వై పథకం కింద మంజూరైన మూడు రోడ్లు, రెండు బ్రిడ్జిలకు రాష్ట్ర అనుమతికి పంచాయతీరాజ్ చీఫ్ ఇంజినీర్‌ను కలిసి శుక్రవారం ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కోరారు. పొదిలి, త్రిపురాంతకం, వై.పాలెం బ్లాకుల్లో 3 తారురోడ్లు, కొత్తపట్నం బ్లాకులో రెండు బ్రిడ్జిల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వ అనుమతి పొందాల్సి ఉంది. పక్కా రోడ్లు, వాగులపై బ్రిడ్జిల వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నందున పొదిలి బ్లాకులో ఉన్న గురవాయపాలెం నుంచి క్రిస్టియన్ పాలెం వరకు 12 కిలోమీటర్లు, త్రిపురాంతకం బ్లాకులో ముదివేముల ఆర్ అండ్‌బీ రోడ్డు నుంచి పి.ముదివేముల వరకు 6 కిలోమీటర్లు, వై.పాలెం బ్లాకులో కోకవానికుంట నుంచి గంజివారిపల్లి వరకు 11 కిలోమీటర్లు మొత్తం మూడు తారురోడ్లు, కొత్తపట్నం మండలంలో పోతురాజు కాలువ, ముదిగొండి వాగులపై రెండు బ్రిడ్జిల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వ అనుమతి పొంది త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కోరారు.